రాజరాజేశ్వరీ దేవికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వైభవంగా శివపార్వతుల కల్యాణం

వెల్దుర్తి, ఆగస్టు 24: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని వెల్దుర్తిలోని రాజరాజేశ్వరీ ఆలయంలో ఆదివారం గణపతి పూజ, హోమం, పూర్ణాహుతి, శివలింగానికి శతరుద్రాభిషేకం, విశేషాలంకరణ చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, పీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇటీవల మృతిచెందిన మాజీ జ డ్పీటీసీ లక్ష్మి భర్త బీఆర్ఎస్ నాయకుడు ముల్క శ్రీనివాస్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు.

మాజీ జడ్పీటీసీ లక్ష్మిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

చాముండేశ్వరీ ఆలయంలో భక్తుల రద్దీ

చాముండేశ్వరీ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుటున్న భక్తులు

చిలిపిచెడ్, ఆగస్టు 25: భక్తుల పాలిట కొంగు బంగారమైన చాముండేశ్వరీ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో చాముండేశ్వరీ ఆలయంలో భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలోని మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పించారు. కొంత మంది భక్తులు వాహన పూజలు చేయించుకున్నారు. ఆలయ ప్రధాన పూజరి ప్రభాకర్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఏసయ్య నామస్మరణలతో హోరెత్తిన చర్చి

ప్రార్థనల్లో భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 25: మెదక్ చర్చి ఏసయ్య నామస్మరలతో హోరెత్తింది. ఆదివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు, పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. దీంతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. గంటగంటకు జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పాల్గొన్నారు. చర్చి ప్రేసిబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య భక్తులనుద్దేశించి దైవసందేశం వినిపించారు. పాస్టర్లు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్ భక్తులను ఆశ్వీరదించారు. ప్రార్థనల్లో సీఎస్ఐ కమిటీ సభ్యులు గంట సంపత్, ప్రాంక్ జాన్సన్, సంశాన్‌సందీప్, సువన్‌డగ్లస్, నోబుల్‌సన్, జాయ్‌ముర్రే పాల్గొన్నారు.

పార్కింగ్, ఫ్లవర్ జోన్‌గా మార్చాలి

రామాయంపేట, ఆగస్టు 25: పార్కింగ్ ఫ్లవర్ జోన్‌గా మార్చాలని సీఐ వెంకటరాజగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాండుచెర్వు కట్టవద్ద ఉన్న నాగులమ్మ గుడి వద్ద ఆలయ కమిటీ నిర్వాహకులు కోటి సత్యనారాయణరావు, దామోదర్‌రావుతో కలిసి మొక్కలు నాటారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

అల్లాదుర్గం, ఆగస్టు 25: టేక్మాల్ మండంలోని 66 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్ ఆదివారం పంపిణీచేశారు. నాయకులు కిషన్, భక్తుల కిశోర్, సుధాకర్, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, సాగర్, అంజయ్య, మహేశ్ రెడ్డి, రాజు, అవినాశ్, మల్లేశం పాల్గొన్నారు.

రేవంత్‌కు బుద్ధి చెబుతాం: సగరులు

రామాయంపేట, ఆగస్టు 25: సగరుల కులగణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తానని మాటిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు మాట మార్చి నేరుగా వెళ్లడం సమంజసం కాదని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని అక్కన్నపేటలో సగర కులగణనను ప్రారంభించి, మాట్లాడారు. తామంతా ఐకంగా ఉంటేనే హక్కులు సాధించుకుంటామన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వస్తే సగరులకు న్యాయం చేస్తానని మాటిచ్చి నేడు తప్పాడన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయిలు, నగేశ్ కార్యదర్శి దత్తు పాల్గొన్నారు.

సభ్యత్వాన్ని నమోదు చేస్తున్న సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్

అలుగులు పారుతున్న చెరువులు

రామాయంపేట శివారులో అలుగు పారుతున్న హనుమ చెరువు

భారీ వరద రావడంతో నిజాంపేట శివారులో అలుగు పారుతున్న హైదర్ చెరువు

రామాయంపేట మండలంలో కాల్వల ద్వారా చెరువుల్లోకి వస్తున్న వరద

- వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండుకుండలా చెరువులు, కుంటలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

రామాయంపేట, ఆగస్టు 25: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు చెరువుల్లోకి వరద చేరి అలుగు పారుతున్నాయి. శనివారం రాత్రి రామాయంపేట ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షం దంచి కొట్టింది. రెండు మండలాల్లో కురిసిన వర్షానికి మండలంలోని డీ.ధర్మారం, కోనాపూర్, దంతెపల్లి తదితర చెరువుల్లోకి వరద వచ్చి చేరింది. పట్టణ శివారులోని హనుమ చెరువు పొంగిపొర్లుతున్నది. నిజాంపేట మండలంలోని తిప్పనగుళ్ల, నందిగామ చెరువులు అలుగులు దుంకుతున్నాయి. బచ్చురాజుపల్లి, కల్వకుంట, నార్లాపూర్, వెంకటాపూర్.కే తదితర గ్రామాల్లోని చెరువులు నిండుకుండలా మారాయి. వర్షాలు సమృద్ధిగా కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట,ఆగస్టు25: వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. ఈ మేరకు నందిగామ సాయి చెరువు, నార్లపూర్, తిప్పనగుల్ల గ్రామాలకు చెందిన హైదర్ చెరువు అలుగు పోస్తున్నాయి. కాస్త ఆలస్యమైనా చెరువులు నిండడంతో పంటలు పండించడానికి ఇబ్బందులుండవని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిజాంపేట మండలం నందిగామలో అలుగు పారుతున్న సాయిచెరువు

భౌభౌలతో జనం బెంబేలు

- ఐదు మండలాల్లో స్వైరవిహారం చేస్తున్న శునకాలు
- వాహనదారులు, పాదచారులపై దాడులు
- వీధికుక్కల బెడద నుంచి రక్షించాలని వేడుకుంటున్న స్థానికులు

నిజాంపేట మండలంలో రోడ్లపైనే శునకాలు

చేగుంటలో వాహనదారుడి వెంట పడుతున్న శునకాలు

కుక్కల బారినుంచి రక్షించాలంటున్న తండావాసులు

రామాయంపేట, ఆగస్టు 25: ఉమ్మడి రామాయంపేట మండలంలో శునకాలు విచ్చలవిడిగా తిరుగుతూ స్థానికులను హడలెత్తిస్తున్నాయి. జనమే కాకుండా కుక్కల బారిన గొర్రెలు, బర్రెలు, మేకలు పడుతున్నాయి. రామాయంపేట, తూప్రాన్, చేగుంట, మనోహరాబాద్, నిజాంపేట మండలాల్లో కుక్కలు బహిరంగ ప్రదేశాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. వాహనదారుల మీదకు ఎగిరి మరీ దాడి చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. తమను వీధి కుక్కల బెడద నుంచి రక్షించాలని అధికారులను వేడుకుంటున్నారు.

రామాయంపేట మండలంలోని సొమ్లా గిరిజన తండాలో గుంపుగా తిరుగుతున్న శునకాలు

రామాయంపేట ప్రభుత్వ దవాఖానలో రేబీస్ టీకా ఇప్పించుకుంటున్న మహిళ

శునకాలు దాడి చేయడంతో దవాఖానలో రోదిస్తున్న చిన్నారి

భారీ వర్షంతో నెలకొరిగిన మొక్కజొన్న

చేగుంట, ఆగస్టు 25: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని మక్కరాజిపేటలో మొక్కజొన్న నేల పాలైంది. దీంతో రైతు బోయిని శ్రీశైలం సుమారు రూ.లక్ష వరకు నష్టపోయాడు. అధికారులు మొక్కజొన్న పంటను పరిశీలించి, ప్రభుత్వం తరపున తనకు నష్టపరిహారం ఇప్పించాలని రైతు శ్రీశైలం కోరారు.

అంబాజిపేటలో తాగునీటి కటకట

పైవేట్ బోరు నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న మహిళలు

చిన్నశంకరంపేట, ఆగస్టు 25: మండల పరిధిలోని అంబాజిపేటలో గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నల్లా నీళ్లు రాక అవస్థలు పడుతున్నారు. గ్రామంలో కొన్ని వాడల్లోని సింగిల్‌ఫేజ్ మోటర్లు పనిచేయకపోవడంతో తాగునీటి కోసం ప్రైవేటు బోరుబావులను ఆశ్రయించాల్సి వస్తున్నది. గ్రామంలోని కుమ్మరి వాడలో సింగిల్‌ఫేజ్ మోటర్ చెడిపోవడంతో నీటి ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. నల్లా నీరు రాక ఇటు మోటర్ పని చేయకపోవడంతో నీటి కోసం దూరంగా ఉన్న వ్యవసాయ బోరు బావుల వద్ద నుంచి నీటిని తీసుకురావాల్సి వస్తున్నదని కాలనీలోని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నల్లానీరు రాక నానా అవస్థలు పడ్డామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి ఏ అధికారి వస్తున్నాడో ఏం చేస్తున్నాడు తెలియని దుస్థితి నెలకొన్నదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని నీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు. బోరు మోటర్లకు మరమ్మతులు చేసి, మిషన్ భగీరథ నీరు వచ్చేలా చర్యలు తీసుకొని నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ హోమం

చేగుంట, ఆగస్టు 25: బోనాల్‌లోని శ్రీనివాస బిన్నీ మాడ్రన్ రైస్‌మిల్‌లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్మడి లక్ష్మణ్ కుటుంబ సభ్యులు 494వ సరస్వతీ హోమాన్ని ఆదివారం సరస్వతీ ఉపాసకుడు విద్యామనోహరశర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

జ్యోతిర్లింగాల ఆలయంలో లక్ష బిల్వార్చన



పెద్దశంకరంపేట, ఆగస్టు 25: పట్టణంలోని జ్యోతిర్లింగాల ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామివారికి లక్షబిల్వార్చన చేశారు. పూజారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు చేశారు. కందుకూరి రవీందర్ అన్నదానం చేశారు.

మెదక్ తైబజార్ వేలం రద్దు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 25: ఈ నెల 22న నిర్వహించాల్సిన మెదక్ తైబజార్ వేలాన్ని ఎమ్మెల్యే రోహిత్‌రావు రద్దు చేయించడంతో పట్టణ కూరగాయల వ్యాపారస్తులు ఆదివారం ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కేంద్రం ఏకీకృత పెన్షన్ పథకం ప్రకటన సరికాదు

బెజ్జంకి, ఆగస్టు 25: కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ పథకంపై ప్రకటన చేయడం సరికాదని టీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగుల జీవితాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చేసిన యూపీఎస్ ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. వెనక్కి తీసుకోకుంటా సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

రుణం మాఫీ కాదట

చేగుంట, ఆగస్టు 25: నాకు రుణం మాఫీ కాదట. నాకు ఎకరన్నర పొలం ఉంది. చేగుంట ఎస్‌బీఐలో రూ.86 వేలు లోను తీసుకున్న. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గెలిస్తే రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిండు. సీఎం చెప్పింది నమ్మినం. రుణమాఫీ మొదటి విడత లిస్టులో నా పేరు రాలే. రెండో లిస్టులో వస్తుందనుకున్న. మూడో లిస్టులో కూడా నా పేరు రాలేదు. బ్యాంకుకు పోయి అడిగితే, నీవు పాత బకాయి రెన్యువల్ చేయలేదు. అందుకు నీకు రుణ మాఫీ రాలేని చెప్పిండ్రు.

- బంగారు పోచయ్య, రైతు, మక్కరాజిపేట, చేగుంట మండలం

85వేలు తీసుకుంటే రెండున్న లక్షలు కట్టుమంటున్నారు

చేగుంట, ఆగస్టు 25: మా అమ్మ చాకలి బాలమ్మ. గతేడాది సహకార బ్యాంకులో రూ. 85 వేల లోను తీసుకున్నది. ఇప్పుడు రెండున్నర లక్షలు కట్టాలని ఇబ్రహీంపూర్ సహకార సంఘం సీవో శ్రీనివాస్ ఒత్తిడి చేస్తున్నారు. మా అమ్మ లోను తీసుకుంటే నా పేరున లోను ఎట్లా వస్తుంది. ఒకరు లోను తీసుకుటే ఇంకో పేరుకు రుణం ఎట్లా మారుస్తారు. ఇలా తారుమారు చేసి ఎంత మంది రైతులను సొసైటీ వారు మోసం చేస్తరు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు లక్షల పంట రుణమాఫీ చేస్తానన్నాడు. మూడు విడతలైనా పంట రుణమాఫీ చేయలేదు. మా పేర్లు తారుమారైన తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా.

- చాకలి భూపాల్, రైతు, మక్కరాజిపేట, చేగుంట మండలం

వివాహిత అదృశ్యం

మనోహరాబాద్, ఆగస్టు 25: వివాహిత అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామానికి చెందిన ఊట్ల రేణుక ఈ నెల 23 న దండుపల్లి గ్రామానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. మళ్లీ తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికిన ఫలి తం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపారు.

పరిస్థితి విషమించి యువకుడు మృతి

మనోహరాబాద్, ఆగస్టు 25: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో యువకుడు మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామానికి చెందిన బండారు చందుబాబు (25) ఈ నెల 13న మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సన్నాహక సమావేశానికి తరలిరావాలి

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 25: సోమవారం నిర్వహించే మాదిగ, ఉపకులాలు సమావేశానికి తరలిరావాలని దళిత సంఘాల నాయకుడు ముక్కెర సంపత్ ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీవర్గీకరణకు కృషి చేసిన మందకృష్ణ మాదిగను హుస్నాబాద్‌కు ఆహ్వానించేందుకు నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీవర్గీకరణకు మద్దతు తెలిపిన నాయకుల కోసం ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సంపత్ పేర్కొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657